సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



గ్రామాలపై నిఘా ఉంచాలి

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ముందస్తు సమాచారం రాబట్టాలని ఎస్పీ రత్న పోలీసులను ఆదేశించారు. 8లో



కిలో టమాట రూ.46

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.46, కనిష్టంగా రూ.30 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.8°/23.3°

జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జిని కలిసిన ఎస్పీ రత్న



హైకోర్టు జడ్జికి పూల బొకే అందజేస్తున్న ఎస్పీ

పుట్టపర్తి టౌన్: అనంతపురం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డిని జిల్లా ఎస్పీ రత్న మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఉన్న జడ్జిని శనివారం ఎస్పీ కలిసి పూలబొకే అందజేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం చేసినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. శనివారం ఆయన, ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. గదులకు వేసిన సీళ్లను తెరిపించి ఈవీఎంలను పరిశీలించారు. ఎన్నికల్లో వినియోగించకుండా రిజర్వులో ఉంచిన ఈవీఎంలను తరలించేందుకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, కలెక్టరేట్ ఎన్నికల విభాగపు డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

5 లోపు ఫ్రీ హోల్డ్ పరిశీలన పూర్తి

- సీసీఎల్ఏకు తెలిపిన కలెక్టర్ టీఎస్ చేతన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన ప్రక్రియను అక్టోబరు 5లో పూర్తి చేసి నివేదిక అందిస్తామని సీసీఎల్ఏ జయలక్ష్మికి కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. నిషేధిత భూములు (22ఎ) జాబితా నుంచి తొలగించిన భూముల రీ–వెరిఫికేషన్ ప్రక్రియపై సీసీఎల్ఏ శనివారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకటశివ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లాలో చేపట్టిన ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన ప్రక్రియ గురించి సీసీఎల్ఏకు వివరించారు. ఫ్రీహోల్డ్ అయిన తర్వాత రిజిస్ట్రేషన్ జరిగిన భూములకు సంబంధించి పునఃపరిశీలన ప్రక్రియను అక్టోబరు 1వ తేదీలోగా పూర్తి చేసి నివేదిక అందిస్తామన్నారు.

నాలుగు మండలాల్లో వాన



ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ నాలుగు మండలాల పరిధిలో మోస్తరు వర్షం కురిసింది. 15.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం మండలంలో 9.6 మి.మీ, కనగానపల్లి 2.4 మి.మీ, పరిగి 2.0 మి.మీ, ధర్మవరం మండలంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

బాబుకు మంచి బుద్ధినివ్వు స్వామీ

'స్వామీ ఆ పాపాత్ములను క్షమించు. తిరుమల ప్రాశస్త్యాన్ని దశదిశలా వ్యాప్తి చేయాల్సిన పదవుల్లో ఉంటూ స్వార్థ రాజకీయం చేస్తున్న వారిని మన్నించు. తిరుమల లడ్డూ పేరుతో నీచ రాజకీయం చేస్తున్న వారికి మంచి బుద్ధి ప్రసాదించు' అంటూ వైఎస్సార్ సీపీ నేతలు శనివారం ఊరూరా ఆలయాల్లో పూజలు చేశారు. మత రాజకీయాలతో పబ్బం గడుపుకోవాలనుకునే వారికి ఆ దేవదేవుడే శిక్ష విధిస్తారని నేతలు వ్యాఖ్యానించారు.

- ప్రజలకు మంచి చేసే బుద్ధి ప్రసాదించు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్
- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణుల పూజలు
- 'జయహో జగన్' అంటూ నేతల నినాదాలు



పార్టీ కార్యకర్తలు, నేతలతో కలిసి పెనుకొండ వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



ధర్మవరం లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి, పుట్టపర్తి

కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుడి ఆగ్రహానికి చంద్రబాబు గురికాక తప్పదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. తిరుమల పవిత్రతను, లడ్డూ ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపహాస్యం చేయగా, ఆయన చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో పూజలు చేశారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని దేవున్ని కోరుకున్నారు. పెనుకొండలోని వేంకటేశ్వరాలయంలో జరిగిన పూజల్లో పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. పూజల అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి ప్రాభవాన్ని దెబ్బతీసే విధంగా చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తిరుపతి లడ్డూ విషయంలో నారా లోకేశ్, చంద్రబాబునాయుడు తలోమాట మాట్లాడుతున్నారన్నారు. తన మతం మానవత్వం అని గర్వంగా చెప్పిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి వేంకటేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీశారు..

మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు జరిగాయి. మడకశిరలోని కోట వేంకటరమణ స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, సీనియర్ నేతలు వైటీ ప్రభాకర్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈరలక్కప్ప మాట్లాడుతూ.. సీఎం హోదాలో చంద్రబాబు తిరుపతి లడ్డూ పవిత్రతను మంటగలిపారని మండిపడ్డారు. లడ్డూలో నాణ్యత లేదన్న చంద్రబాబు వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉన్నాయన్నారు.

చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించు స్వామీ..

సీఎం చంద్రబాబునాయుడికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ హిందూపురంలోని పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు పూజలు చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక భర్త గుడ్డంపల్లి వేణురెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం వేణురెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం గురించి.. లడ్డూ ప్రసాదాల గురించి పూటకో మాట మాట్లాడుతున్న చంద్రబాబునాయుడుకు సద్బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ని కోరినట్లు చెప్పారు.

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే..


పుట్టపర్తిలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి (వాసు) ఆధ్వర్యంలో సత్యమ్మ గుడి సర్కిల్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పూజలు నిర్వహించారు. అనంతరం వాసు మాట్లాడుతూ.. తన వందరోజుల పాలనలో చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చలేకపోయారని, ప్రజలు నిలదీస్తారనే భయంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీశారన్నారు. ఈ క్రమంలోనే తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యి సరిగా లేదంటూ ఆరోపణలు చేశారన్నారు. తన స్వార్థం కోసం చివరకు కలియుగ దైవం కొలువైన తిరుమలనూ రాజకీయాల్లోకి తెచ్చారని మండిపడ్డారు. ఇకనైనా చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ని కోరుకున్నట్లు తెలిపారు.

హామీలు అమలు చేయలేక...

తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో సీఎం చంద్రబాబునాయుడు అబద్ధాలు చెబుతున్నారని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. కదిరిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పూల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. హామీలు అమలు చేయలేక దేవుళ్ల దగ్గర చంద్రబాబు రాజకీయం చేస్తున్నారన్నారు. ఆలయ దర్శనానికి వెళ్లేందుకు డిక్లరేషన్ ఎందుకని ప్రశ్నించారు.

ఆయనది చెత్త రాజకీయం..

సీఎం చంద్రబాబు గత నలభై ఏళ్లుగా చెత్త రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు శనివారం సాయంత్రం ధర్మవరంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. తన అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబు లడ్డూ వివాదానికి తెర తీశారన్నారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో పార్టీ నేతలు , కార్యకర్తలు పాల్గొన్నారు.



పెనుకొండ వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శంకరనారాయణ



హిందూపురం పేట వెంకటరమణ స్వామి ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఖాద్రీశుని ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



పూజల్లో పాల్గొన్న మడకశిర వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు



పుట్టపర్తి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో పార్టీ నేతలు...

వివాదాస్పద తీరు.. ఆగడాల్లో సరిలేరు!

- అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌పై ఆరోపణలెన్నో..
- కందుకూరి శివారెడ్డి హత్య కేసులో నిందితులకు బాసట
- ప్రాణహాని ఉందని అప్పట్లో వారం ముందే వినతిపత్రం ఇచ్చిన బాధితులు
- అయినా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి హత్యకు పరోక్షంగా కారణమైన సీఐ
- ప్రసాదరెడ్డి హత్య సమయంలోనూ ఈయనపై విమర్శలు
- ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుపాటి అప్పట్లో రాప్తాడు ఎంపీపీ
- దీంతోనే ఏరికోరి ఇక్కడికి తెచ్చుకున్నారని విమర్శలు
- సెటిల్‌మెంట్లలోనూ దిట్ట అని రాజేంద్రనాథ్‌కు పేరు
- అలాంటి వ్యక్తిని అందలమెక్కించడంపై ప్రజల విస్మయం

ఎక్కడైనా ఒక పోలీసు అధికారికి మంచి పోస్టింగ్ ఇవ్వాలంటే పనితీరు, నిజాయితీ వంటివి చూస్తారు. కానీ ఆ సీఐకి ఈ అర్హతలే లేవు. పైపచ్చు ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. హత్య కేసుల్లో నిందితులకు సహకరిస్తారని, బాధితులపైనే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తారనే విమర్శలు ఉన్నాయి. ల్యాండ్ సెటిల్‌మెంట్లు, రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తడంలో ఘనాపాటిగా పేరుంది. అలాంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరిచి మరీ అందలం ఎక్కించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: గతంలో రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన రెండు హత్యలు రాష్ట్రంలోనే సంచలనం సృష్టించాయి. అనంతపురం రూరల్ మండలం కందుకూరులో 2018 మార్చి 30న వైఎస్సార్ సీపీ నేత శివారెడ్డి దారుణ హత్యకు గురయ్యారు.ఇటుకలపల్లి నుంచి స్వగ్రామం వెళ్తుండగా దారిలో కాపుకాచిన ప్రత్యర్థులు వేటకొడవళ్లతో అతి కిరాతకంగా ఆయనను నరికి చంపారు. ఈ హత్యకు వారం రోజుల ముందే రెండు వర్గాల నడుమ గొడవ జరిగింది. ఈ క్రమంలోనే శివారెడ్డి సోదరుడు తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ వినతిపత్రం అందించగా, అప్పట్లో సీఐగా ఉన్న రాజేంద్రనాథ్ యాదవ్ దాన్ని చెత్తబుట్టలో పడేశారు. ఆ తర్వాత వారం రోజులకే శివారెడ్డి హత్య జరిగింది. వినతిపత్రం ఇచ్చినప్పుడే నిందితులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి ఉంటే అసలు హత్యే జరిగి ఉండేది కాదని కందుకూరు గ్రామస్తులు నేటికీ చెబుతున్నారు. శివారెడ్డి హత్యకు పరోక్షంగా సీఐ కూడా కారణమంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంచలనం సృష్టించిన ఈ హత్య కేసు విచారణ అధికారిగా రాజేంద్రనాథ్ ఉంటే బాధితులకు న్యాయం జరగదని మరో పోలీసు అధికారిని ఉన్నతాధికారులు నియమించడం గమనార్హం.

ప్రసాదరెడ్డి హత్య కేసులోనూ..

2015 ఏప్రిల్ 29న ఏకంగా రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలోనే వైఎస్సార్ సీపీ కీలక నేత భూమిరెడ్డి శివప్రసాద్ రెడ్డి హత్యకు గురయ్యారు. ఈ హత్య నేపథ్యంలోనూ రాజేంద్రనాథ్ వ్యవహార శైలిపై విమర్శలు వచ్చాయి. ప్రస్తుత అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కారును అప్పట్లో శివప్రసాద్ రెడ్డి హత్య కేసు నిందితులు వాడినట్టు తేలింది. ఆ సమయంలో దగ్గుపాటి ప్రసాద్ రాప్తాడు ఎంపీపీగా ఉన్నారు. ఇప్పుడు దగ్గుపాటి అనంతపురం ఎమ్మెల్యే కావడంతో రాజేంద్రనాథ్ ఏకంగా కీలకమైన వన్‌టౌన్‌కు పోస్టింగ్ తెచ్చుకోగలిగారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సీఐ రాజేంద్రనాథ్ యాదవ్

సెటిల్‌మెంట్లలో ఘనుడు!

రాప్తాడుకు చెందిన ఓ విలేకరికి, ఆయన అన్నదమ్ములకు మధ్య భూ వివాదం నడుస్తోంది. వీరిలో ఒక వర్గానికి పరిటాల కుటుంబం మద్దతు ఉంది. దీంతో అప్పట్లో మంత్రి అయిన పరిటాల సునీత ఒత్తిడితో విలేకరిపై సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ రెచ్చిపోయారు. విలేకరి చొక్కా పట్టుకుని 'భూమి మీద నీకు హక్కులేదు, మర్యాదగా వచ్చి సంతకాలు చేస్తావా లేదా' అని బెదిరించారు. దీంతో బాధిత విలేకరి అప్పట్లో తన మిత్రులతో కలిసి పోలీసుస్టేషన్ ముందు ధర్నాకు దిగగా సీఐ క్షమాపణలు చెప్పారు. ఇలా ల్యాండ్ సెటిల్‌మెంట్లలోనూ ఘనాపాటిగా రాజేంద్రనాథ్ యాదవ్ పేరు తెచ్చుకున్నారు.

తాజాగా స్టూడెంట్ యూనియన్ నేతలపై..

నేటికీ రాజేంద్రనాథ్ యాదవ్ తన వివాదాస్పద వైఖరిని వీడలేదు. స్టూడెంట్ యూనియన్ నాయకులపై ఇటీవల తీవ్రస్థాయిలో రెచ్చిపోయారు. స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలంటూ అనంతపురంలోని పెన్నార్ భవన్ వద్ద ధర్నాకు దిగిన ఏఐఎస్ఎఫ్ నేతలపై చిందులు తొక్కారు. సీఐ వాడిన భాష అత్యంత జుగుప్సాకరంగా ఉందని, తమను కొట్టడానికి కూడా యత్నించారని, విద్యార్థుల పట్ల కూడా అమానవీయంగా వ్యవహరించారని విద్యార్థి సంఘం నేతలు వాపోయారు. ఇలా తాను ఎక్కడ పనిచేసినా లెక్కలేనన్ని 'ఘనతలు' మూటగట్టుకున్న వ్యక్తికి నగరంలో కీలక స్థానాన్ని కట్టబెట్టడం ఉమ్మడి జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది. చిన్న తప్పు చేసినా పెద్ద శిక్ష వేసే పోలీసు బాస్‌లు రాజేంద్రనాథ్ యాదవ్ విషయంలో ఉదారంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ఆరిన ఇంటిదీపం

- నీటి బకెట్‌లో పడి 13 నెలల చిన్నారి మృతి
- ఒక్కగానొక్క బిడ్డను కోల్పోయి కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



మోక్షిత (ఫైల్)

గుడిబండ: మండల పరిధిలో ఎస్ఎస్ గుండ్లు గ్రామానికి చెందిన జయరామప్పకు సింధుతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం గడిపే వారికి మూడేళ్ల వరకూ సంతాన భాగ్యం లేకపోవడంతో తల్లడిల్లిపోయారు. పూజలు, నోములు నోచారు. వివిధ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లి చూపించుకున్నారు. అవన్నీ ఫలించడంతో సింధు 13 నెలల క్రితం పండంటి పాపాయికి జన్మనిచ్చింది. దీంతో ఆనందపడిపోయిన జయరామప్ప ఆ చిన్నారికి మోక్షిత అని పేరు పెట్టుకున్నాడు. పాప బోసినవ్వులు చూసి సింధు, జయరామప్ప కష్టమంతా మరచిపోయేవారు. ఇటీవలే చిన్నారి బుడిబుడి అడుగులు వేస్తుండటాన్ని చూసి సంతోషపడ్డారు. తమ ఇంటిదీపాన్ని కంటికిరెప్పలా కాపాడుకునే వారు. ఈ క్రమంలోనే శనివారం జయరామప్ప వ్యవసాయ పనులకు వెళ్లగా.. సింధు ఇంటి పనుల్లో నిమగ్నమైంది. చిన్నారి మోక్షిత ఇంట్లోనే అటుఇటూ నడుస్తూ ఆడుకుంటోంది. అలా ఆడుకుంటూ ఇంటి బయటకు వెళ్లి నీటి బకెట్‌లో పడిపోయింది. బకెట్ నిండా నీరు ఉండటంతో అందులో మునిగిపోయింది. కాస్త ఆలస్యంగా గమనించిన తల్లి సింధు వెంటనే పాపను బకెట్‌లోంచి తీసి మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో జయరామప్ప, సింధు దంపతులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మూడేళ్లుగా ఆ దంపతులు ఎన్నో నోములు నోచారు. ఎందరో వైద్యుల వద్దకు వెళ్లారు. దేవుళ్లను వేడుకున్నారు. సంతాన భాగ్యం కోసం ముడుపులు కట్టారు. వారి ఆశలు ఫలించగా... 13 నెలల క్రితం ఆ ఇంట బోసినవ్వులు రువ్వాయి. తమ ప్రతిరూపాన్ని ఆ దంపతులు కళ్లలో పెట్టుకుని చూసుకున్నారు. వారి ఆనందాన్ని చూసి విధికి కన్నుకుట్టిందేమోగానీ నీటిబకెట్ రూపంలో ఆ ఇంటిదీపాన్ని ఆర్పేసింది. ఆ దంపతులకు తీరని శోకాన్ని మిగిల్చింది.

రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 30న (సోమవారం) జిల్లా సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు సీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడంతో పాటు తమ మండలం ఫుట్‌బాల్ క్లబ్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ పేర్కొన్నారు. లేకపోతే ఎంపిక పోటీల్లో ఆడేందుకు అనుమతించబోమన్నారు. వివరాలకు 80995 98958 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బాలసదన్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ధర్మవరం, హిందూపురం బాలసదన్‌లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టోర్ కీపర్ కం అకౌంటెంట్ పోస్టులు 2, కుక్ పోస్టు ఒకటి, ఎడ్యుకేటర్(పార్ట్ టైం) పోస్టులు 2, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్(పార్ట్ టైం) పోస్టులు 4, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ (పార్ట్ టైం) పోస్టులు 2, హౌస్ కీపర్, హెల్పర్ కం నైట్ వాచ్ మెన్ పోస్టు ఒకటి చొప్పున మొత్తం 14 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. 30 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళలు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులు పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. https//srisatyasai. ap. gov. in వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబర్ 8వ తేదీలోపు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. గడువు ముగిసిన తర్వాత అందే దరఖాస్తులను స్వీకరించబోమన్నారు.

సీఐ అర్జున్‌నాయక్ మృతి



సీఐ అర్జున్ నాయక్ (ఫైల్)

నల్లమాడ: మండలంలోని అరవవాండ్లపల్లి తండాకు చెందిన సీఐ రమావత్ అర్జున్ నాయక్(59) మృతి చెందారు. ప్రస్తుతం కడప ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న అర్జున్ నాయక్ శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. కుటుంబీకులు ఆస్పత్రి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఆయన మృతదేహాన్ని స్వగ్రామం అరవవాండ్లపల్లి తండాకు తీసుకువచ్చారు. ఆదివారం(నేడు) అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు వెల్లడించారు. అర్జున్ నాయక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సీఐ అర్జున్ నాయక్ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్ర హాకీ జట్టుకు జిల్లా క్రీడాకారిణులు


కోచ్ హస్సేన్‌తో క్రీడాకారిణులు

ధర్మవరం అర్బన్: జార్ఖండ్ రాజధాని రాంచీలో ఈ నెల 30 నుంచి అక్టోబర్ పదో తేదీ వరకు నిర్వహించే 14వ జాతీయస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారిణులు పావని, పవిత్ర, సింధు ఎంపికయ్యారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా సత్యసాయి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ హాకీ కోచ్ హస్సేన్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో కూడా క్రీడాకారిణులు రాణించాలని ఆకాంక్షించారు.

మైనాస్వామికి ఉత్తమ అవార్డు


అవార్డు అందుకున్న చరిత్రకారుడు మైనాస్వామి

పుట్టపర్తి టౌన్: ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో చరిత్రకారుడు మైనాస్వామి తను రచించిన 'ఆర్కిటెక్చర్ ఆఫ్ విజయనగరం –లేపాక్షి' ఆంగ్ల పుస్తకానికి ఉత్తమ ప్రచార అవార్డును విజయవాడలో అందుకున్నారు. మైనాస్వామి 'విజయనగర సామ్రాజ్య సాంస్కృతిక వైభవానికి ప్రతీక లేపాక్షి' పుస్తకం మొదటి ప్రచురణ తెలుగుభాషలో వచ్చింది. పాఠకుల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఇదే పుస్తకాన్ని కన్నడ, ఆంగ్లంలోకి అనువదించి గత సంవత్సరం విడుదల చేశారు. ఆ సంవత్సరం ప్రధాని నరేంద్రమోదీ లేపాక్షి ఆలయానికి విచ్చేసినప్పుడు మైనాస్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించి ఆలయ శిల్పాలను వివరించారు. ఈ పుస్తకాల ప్రచురణ చేసిన సందర్భంగా పర్యాటక శాఖ ఆంగ్లంలో మంచి ప్రచురణగా గుర్తించి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆయనకు అవార్డు దక్కింది.

అంతర్రాష్ట్ర జూదరుల అరెస్ట్

పావగడ: తాలూకాలోని దొమ్మతమరి గ్రామ పంచాయతీ గుమ్మఘట్ట గ్రామ సరిహద్దున జూదకేంద్రంపై తుమకూరు ఎస్పీ అశోక్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందం దాడులు నిర్వహించింది. మడకశిర, పావగడ ప్రాంతాలకు చెందిన 32 మంది అంతర్రాష్ట్ర జూదరులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.2లక్షల నగదు, 25 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేశ్ శనివారం తెలిపారు.

అల.. అద్భుత ఆవాసం


గుడ్లు పెట్టడానికి అనువుగా పక్షి ఏర్పాటు చేసుకున్న గూడు


అద్భుత నిర్మాణం చేసిన సాలీడు

ప్రకృతిలో ఎన్నో వింతలు. అందులో పక్షులు, కీటకాలు, సాలీడు, చీమలు వంటివి ఏర్పాటు చేసుకున్న ఆవాసాలు అబ్బురపరుస్తుంటాయి. ఎండకు, వానకు, గాలికి తట్టుకునే విధంగా తీర్చిదిద్దాయి. లోపలకు వెళ్లడానికి, బయటకు రావడానికి అరలు అరలుగా ద్వారాల ఏర్పాటుతో పాటు కొమ్మ పట్టు జారకుండా జాగ్రత్త తీసుకుంటూ నిర్మించిన గూళ్లు వాటి ప్రతిభను చాటిచెబుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పుట్టపర్తి సమీపంలో ఎక్కడ చూసినా పచ్చదనం సంతరించుకుంది. చెట్లు చిగురించాయి. ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తోంది. చెట్ల కొమ్మలపై పక్షులు గూళ్లు నిర్మించుకుని కనువిందు చేస్తున్నాయి.

– పుట్టపర్తి అర్బన్:


చెట్టు కొమ్మలపై నిర్మించిన గిజిగాడు గూళ్లు

ముమ్మరంగా వైఎస్సార్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు


నార్పింపల్లిలో సభ్యత్వ నమోదు చేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నేతలు

పుట్టపర్తి: వైఎస్సార్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. యూనియన్ నేతలతో కలిసి జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి శనివారం బుక్కపట్నం మండలంలోని పలు పాఠశాలల్లో పర్యటించి సభ్యత్వ నమోదు చేయించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి (వాసు) తదితరులు పాల్గొన్నారు.

భార్యకు ఆపరేషన్ చేయించలేక భర్త బలవన్మరణం


ఆత్మహత్య చేసుకున్న లక్ష్మీనారాయణప్ప

చిలమత్తూరు: అనారోగ్యంతో ఉన్న భార్యకు ఆపరేషన్ చేయించే ఆర్థిక స్థోమత లేక భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీపురానికి చెందిన గొర్రెల కాపరి లక్ష్మీనారాయణప్ప (55) భార్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చాలా ఆస్పత్రుల్లో చూపించాడు. ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. అయితే అందుకు తగ్గ డబ్బు తన వద్ద లేకపోవడంతో మనస్తాపం చెందాడు. శనివారం ఉదయం పొలానికి వెళ్లిన లక్ష్మీనారాయణప్ప చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

జాతీయ స్థాయిపోటీలకు గురుకుల విద్యార్థిని

బుక్కరాయసముద్రం: కొర్రపాడు వద్దనున్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న లహరి జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో వైజాగ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో లహరి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైందని వివరించారు. అక్టోబర్–4, 5 తేదీల్లో హైదరాబాద్ యూసఫ్‌గూడ కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగే 24వ జూనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా లహరిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, సరళ, పీఈటీలు వరలక్ష్మి, తేజేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

రిటైర్డ్ ఏఎస్‌ఐ ఇంట్లో చోరీ

రాప్తాడురూరల్: రిటైర్డ్ ఏఎస్‌ఐ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు గణేష్‌నగర్‌లో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్‌ఐ వీరాంజనేయులు తన కుటుంబంతో ఈ నెల 25న షిర్డీకి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. తలుపు తీసి లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.50 వేలు విలువ చేసే డైమండ్ నెక్లెస్, రూ.8 వేలు విలువ చేసే డైమండ్ రింగ్, 12 గ్రాముల బంగారు చైనును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో ఉదయాన్నే సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ రాంబాబు సిబ్బందితో వెళ్లి ఇంటిని పరిశీలించారు. కొత్త తరహా దొంగతనం జరగడం పోలీసులను ఆశ్చర్యపరిచింది. ఇంటి ప్రధాన డోరును ఏమాత్రం ముట్టుకోలేదు. బాత్రూం కిటికీని తొలగించి అందులోంచి ఇంటిలోకి ప్రవేశించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత వస్త్రంపై హిందీ ఔన్నత్యం


పట్టు వస్త్రాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర హ్యాండ్‌లూమ్ మంత్రి గిరిరాజ్‌సింగ్


పట్టువస్త్రాన్ని చూపుతున్న డిజైనర్ నాగరాజు

ధర్మవరం: హిందీ ఔన్నత్యాన్ని చాటుతూ నేసిన చేనేత వస్త్రాన్ని కేంద్ర హ్యాండ్‌లూమ్ మంత్రి గిరిరాజ్‌సింగ్ ఆవిష్కరించారు. ధర్మవరం పట్టణానికి చెందిన డిజైనర్ నాగరాజు స్వచ్ఛమైన పట్టు, బంగారు జరీ పోగులను ఉపయోగించి పట్టు వస్త్రంపై చేతితో నేశారు. పట్టు వస్త్రంపై హిందీ దేశ గర్వం అనే నినాదం, భారత రాజముద్ర, ఇతర డిజైన్లు పట్టు వస్త్రంలో వచ్చే విధంగా చేనేత మగ్గంలో తయారు చేశారు. ఈ వస్త్రాన్ని చేనేత కార్మికులు సురేంద్రబాబు, రాఘవ సహకారంతో తయారు చేశారు. ఆ వస్త్రాన్ని శనివారం కేంద్ర హ్యాండ్‌లూమ్ మంత్రి చేతులమీదుగా ఆవిష్కరించారు.

గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి

- పోలీసులకు ఎస్పీ రత్న ఆదేశం


వివిధ కేసుల్లో నిందితుల వివరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

బత్తలపల్లి: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి గొడవలు, ఘర్షణలు జరగకుండా చూసుకోవాలని ఎస్పీ రత్న పోలీసులను ఆదేశించారు. శనివారం ఆమె బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల వివరాలు, దర్యాప్తుల పురోగతిపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు, నేరాలపైన దృష్టి సారించాలన్నారు. గ్రామ సందర్శన, పల్లె నిద్ర కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆదేశించారు. మహిళా కానిస్టేబుళ్ల ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళలపై నేరాలను నిరోధించాలన్నారు. ప్రతి పోలీసుకు ఒక గ్రామం ఇప్పటికే కేటాయించామని, వారు ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ గొడవలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తు సమాచారం ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. అనంతరం ఎస్పీ రత్న స్టేషన్ ఆవరణను పరిశీలించారు. వివిధ ప్రమాదాల్లో సీజ్ చేసిన వాహనాలను నిబంధనల మేరకు యజమానులకు అప్పగించాలని ఎస్‌ఐ శ్రీనివాసులును ఆదేశించారు.

రిటైర్డ్ ఏఎస్‌ఐ ఇంట్లో చోరీ

రాప్తాడురూరల్: రిటైర్డ్ ఏఎస్‌ఐ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్‌ఐ వీరాంజనేయులు తన కుటుంబంతో ఈ నెల 25న షిర్డీకి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. తలుపు తీసి లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.50 వేలు విలువ చేసే డైమండ్ నెక్లెస్, రూ.8 వేలు విలువ చేసే డైమండ్ రింగ్, 12 గ్రాముల బంగారు చైను చోరీ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో ఉదయాన్నే సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ రాంబాబు సిబ్బందితో వెళ్లి ఇంటిని పరిశీలించారు. బాత్రూం కిటికీ తొలగించి ఇంటిలోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నేతల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తుల కోసం పనిచేస్తోందని కార్మిక సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఎందరో త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడం కార్మికులకు తీవ్ర ద్రోహం చేయడమేనని అన్నారు. ప్రైవేటీకరణ చర్యను తక్షణం నిలుపుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలనే అంశంపై శనివారం అనంతపురంలోని జేవీవీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి నాగవేణి మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణలో కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వెళుతున్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుండడం శోచనీయమన్నారు. తొలి నుంచి కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులకు తీవ్ర నష్టం కలిగించిందని గుర్తు చేశారు. అదే క్రమంలో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చేసి కార్మికుల పొట్ట గొట్టేందుకు సిద్ధపడిందన్నారు. ప్రైవేటీకరణ చర్యలు ఆపకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నాగరాజు, చిరంజీవి, వెంకటనారాయణ, హనుమంతరాయుడు, కళ్లాయిస్వామి, నరేష్, సురేష్, శంకర్, వీరేంద్ర, రాజు పాల్గొన్నారు.

పోరాట సమన్వయ సమితి కమిటీ

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలుపుదలకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించడంతో పాటు పోరాట సమన్వయ సమితి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. విశాఖ ఉక్కు పోరాట సమన్వయ సమితి జిల్లా కమిటీ కన్వీనర్‌గా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, కో– కన్వీనర్లుగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం ఎన్నికయ్యారు. సభ్యులుగా కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, రైతు కూలీ, ప్రజా సంఘాల నాయకులు మల్లికార్జున, చంద్రశేఖర్ రెడ్డి, నాగరాజు, రాజేష్, వెంకటనారాయణ, సురేష్, చంద్రశేఖర్, శేఖర్, కుళ్లాయిస్వామి, పరమేష్, నరేష్, వీరేంద్ర, సంతోష్, బాలకృష్ణ, హరిణి, వేమన, సూర్యనారాయణ, కృష్ణను ఎన్నుకున్నారు. అక్టోబరు ఒకటవ తేదీన విద్యార్థి, యువజన సంఘాలు, రెండో తేదీన కార్మిక సంఘాలు, మూడో తేదీన రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు.

పట్టుపట్టారు.. పతకం కొట్టారు


విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

- జాతీయస్థాయి జూడో పోటీల్లో ధర్మవరం విద్యార్థినుల సత్తా
- పట్టణంలో ఊరేగించిన ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: జాతీయ స్థాయి జూడో పోటీల్లో ధర్మవరం విద్యార్థినులు సత్తాచాటారు. ఉడుంపట్టుతో పతకాలు కొల్లగొట్టారు. ఈనెల 22, 23, 24 తేదీల్లో కేరళలోని త్రిసూర్ వీఎస్‌కే ఇండోర్ స్టేడియంలో జరిగిన జూడో ఖేలో ఇండియా ఉమెన్స్ నేషనల్ పోటీల్లో ధర్మవరం విద్యార్థిని గవ్వల యువసంధ్య (మైనస్ 28 కేజీ విభాగంలో) సిల్వర్ మెడల్ సాధించింది. అలాగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర జూడో సెలక్షన్ పోటీల్లో అక్షయణి (మైనస్ 23 కేజీ విభాగంలో) గోల్డ్ మెడల్ సాధించి నేషనల్ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను శనివారం పట్టణంలో ఊరేగించారు. అనంతరం కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో గవ్వల యువసంధ్య, అక్షయణిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్ నాయక్, పాఠశాల హెచ్‌ఎం మేరి వరకుమారి, జూడో కోచ్ ఇనాయత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- వేరుశనగ, కంది పంటలకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్


ఎండిన వేరుశనగ పంటను చూపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

రాప్తాడు: ప్రస్తుత ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. రాప్తాడులో రైతు పామాల కొండప్ప ఏడు ఎకరాల్లో సాగు చేసిన పంటను ఆయన పరిశీలించారు. పంట ఎండుముఖం పట్టడంతో కారణాలపై ఆరా తీశారు. పంట సాగు చేసి రెండు నెలలైనా పదునైన వర్షం పడలేదని రైతు తెలిపాడు. పంట దక్కకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన పంటగా వేరుశనగ ఏటా 8 లక్షల హెక్టార్లలో సాగవుతోందన్నారు. అయితే ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. ప్రస్తుతం వర్షం వచ్చినా పంట దక్కే పరిస్థితులు లేవన్నారు. చెట్టుకు ఒకటి, రెండు కాయలు మాత్రమే ఉన్నాయన్నారు. వేరుశనగ సాగుకు ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల దాకా పెట్టుబడి పెడితే.. ఇప్పుడు దిగుబడి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఏటేటా పంటలు నష్టపోయి రైతులు అప్పులపాలవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేరుశనగతో పాటు కంది పంటకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం వచ్చే వారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం, సీపీఎం, కౌలు రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ బీఈడీ కళాశాలలో అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 30న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ సైన్సెస్ (మెథడాలజీ) అకడమిక్ కన్సల్టెంట్ పోస్టు భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెస్సీ (ఫిజిక్స్), ఎంఈడీ, పీహెచ్‌డీ లేదా నెట్/సెట్ (పెడగాగి సబ్జెక్టు లేదా ఎడ్యుకేషన్), బీఈడీ (ఫిజికల్ సైన్సెస్ మెథడాలజీ) అర్హత గల వారు ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: అక్టోబర్ 5న 'వరల్డ్ టీచర్స్ డే' సందర్భంగా భారతీయ సంస్కృతిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న గురువుల కృషిని గుర్తిస్తూ వారికి జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయిలో వేర్వేరుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలనందించనున్నట్లు 'ఆల్ ది బెస్టు అకాడమీ' సాంస్కృతిక, సాహిత్య సంస్థ వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యారంగమే కాకుండా వివిధ రంగాలలో గురువులుగా రాణిస్తున్న వారు అవార్డులకు అర్హులని, వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ, డోర్‌నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ –15' చిరునామా చేరే విధంగా పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.